క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు, కౌన్సిలర్ సత్యలక్ష్మి

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2023–24 సంవత్సరానికి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కెనరా బ్యాంక్ అధికారులు ఉపకార వేతనాలను గురువారం పంపిణీ చేశారు. 6, 7 తరగతుల విద్యార్థులకు రూ.3 వేల చొప్పున, 8, 9, 10 తరగతి విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేసినట్లు స్థానిక కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జి.సందీప్ కృష్ణ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సీనియర్ మేనేజర్ పందిరి కుమారస్వామి, పాఠశాల హెచ్ఎం కె.ఘన సత్యనారాయణ, కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓఎన్జీసీ పరిహారం

యానాం: నియోజకవర్గంలో వివిధ కారణాల వల్ల 173 మంది మత్స్యకారులకు నిలిచిపోయిన పరిహారం త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం స్థానిక యర్రాగార్డెన్స్‌లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన మత్స్యకారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పీడబ్ల్యూడీ, ఎన్ఎంఆర్‌ల సమస్యలు సైతం అతి త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. వరదల సమయంలో రక్షణకు సంబంధించి గోడ నిర్మాణాన్ని సైతం త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

దాడిపై ఖండన

యానాం: స్థానిక టాక్సీ డ్రైవర్ రమేష్‌పై ది యానాం రెసిడెన్షియల్ టాక్సీ ఓనర్స్ కమ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ సిలేమాన్ దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు సీఐటీయూ కన్వీనర్ కుంచే సత్యనారాయణ పేర్కొన్నారు. దాడికి గురై స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రమేష్‌ను ఆయన గురువారం పరామర్శించారు.

ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలి



విలసవిల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఉప్పలగుప్తం: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విలసవిల్లిలో సిద్ధార్థ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల మాలమహానాడు జేఏసీ కార్యకర్తలు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వస్కా మల్లేశ్వరరావు, కుంచే బాబులు, పెయ్యల పరశురాముడు, జల్లి శ్రీనివాస్, యాళ్ల లక్ష్మీనారాయణ, ములపర్తి కాశీ, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం నాయకులకు సత్కారం



సత్కారం అందుకున్న రజక సంఘం సీనియర్ నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక ముస్లిం వీధిలోని రజక భవనంలో రజక సంఘం సీనియర్ నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం సంఘీయులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా 16 మంది సీనియర్ రజక నేతలను సత్కరించారు. కార్యక్రమంలో పేట ఏడుకొండలు, నేదునూరి రమణ, కోటపల్లి మోహనరావు, కళ్యాణ్, చిరంజీవి, పాపారావుతో పాటు పలు గ్రామాల రజక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళాల వెల్లువ



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కిశోర్‌కుమార్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్ కుమార్ తెలిపారు. పాలకొల్లుకు చెందిన తటవర్తి సుధాకర్‌రావు, లక్ష్మి శారదదేవిలు స్వామివారికి తిరుచి వాహనం సమర్పించారు. వాడపల్లి గ్రామానికి చెందిన ఎరుబండి రాజు, సూర్యకుమారి దంపతులు విష్వక్సేనుడికి సుమారు 200 గ్రాముల వెండి కిరీటం అందించారు. తేతలికి చెందిన సోమసుందరరెడ్డి సుధా దంపతులు కిలో వెండి కిరీటం సమర్పించారు. దాతలకు ఈఓ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటాలు అందజేశారు.



అమలాపురం ఆరోగ్య ఉద్యానవనంలో జాతీయ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



అమలాపురం ప్రెస్ క్లబ్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆనందరావు



తాళ్లరేవు ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సునీత



మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



అల్లవరం హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

- వాడవాడలా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- సంబరాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



గోడి బాలుర గురుకులంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు



యానాంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి లక్ష్మీనారాయణ



కేశనకుర్రు పీహెచ్‌సీ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజేష్‌బాబు

అమలాపురం టౌన్: దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు సమరయోధులు చేసిన త్యాగాలు, పోరాట పటిమ అజరామరమని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భారత మాత విగ్రహానికి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పూలమాలను వేశారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక తామర చెరువు వద్ద గల డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఉద్యానవనం వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు ఆశెట్టి నాగదుర్గ, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు.

త్యాగధనుల పుణ్యఫలమే స్వాతంత్ర్యం

అల్లవరం: ఎందరో త్యాగధనుల పుణ్యఫలం వల్లే భారతీయులందరికీ స్వాతంత్ర్యం లభించిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడి బాలుర గురుకులంలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో శాసనమండలి సభ్యులు ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మువ్వన్నెల జెండాను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ఆవిష్కరించారు. అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హరీష్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అల్లవరం ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, ఎంపీడీఓ కృష్ణమోహన్, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, మౌనిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన స్వతంత్ర దినోత్సవంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు, స్థానిక సీహెచ్‌సీ వద్ద డీసీఎస్ శిరీష, పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తాళ్లరేవు పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులను సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో బొద్దు సత్యనారాయణ, కుడుపూడి శివన్నారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, కామాడి మాతరాజు, కొక్కిలిగడ్డ లోకేష్, దత్తాత్రేయ వర్మ, రోళ్ల చక్రవర్తి, పోతాబత్తుల నూకరాజు, గంజా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా జెండా పండగ

ఐ.పోలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కాశి విశ్వేశ్వరరావు, పాతయింజరం పోలీస్‌స్టేషన్ వద్ద ఏఎస్ఐ ఎ.వెంకటేశ్వరావులు జాతీయ జెండాను ఎగురవేశారు. కేశనకుర్రుపాలెంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి రంగరాజు తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కేశనకుర్రు, జి.వేమవరం పీహెచ్‌సీల వద్ద వైద్యులు గాయత్రి, రాజేష్‌బాబులు జాతీయ జెండాను ఎగురవేశారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద వైస్ చైర్మన్ రెడ్డి హేమ సుందరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కోలా గంగా భవానీ, కోలా బాబ్జీ, ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈఓ బొజ్జా రమణశ్రీ జాతీయ జెండాను ఎగురవేశారు. జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి మహమ్మద్ రహంతుల్లా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

యానాం: నియోజకవర్గ పరిధిలో 78వ స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అంతకుముందు శాంతి కపోతాలను, త్రివర్ణ బెలూన్లను మంత్రి లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని జెండా ఎగురవేశారు. ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఎంపీపీ దంగేటి వీర అచ్యుతజానకి, తహసీల్దారు కార్యాలయంలో వీఎస్ దివాకర్ జాతీయ జెండాలను ఎగురవేశారు. స్వాత్రంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యానాం: యానాం నవోదయ విద్యాలయలో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సంలో విద్యాలయ సమితి మేఘాలయ షిల్లాంగ్ అసిస్టెంట్ కమిషనర్ టీవీఎస్ ప్రకాశరావు హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. యానాం సబ్‌కోర్టు ఆవరణలో జడ్జి కె.రాజామోహన్ జాతీయజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అడ్వకేట్లు కమిడి విజయకుమార్, పేర్ని ఆదినారాయణ, గెద్దం ఈశ్వరరావు, పడాల సుబ్బారావు, బాషా, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: త్రిరత్న బుద్ధ విహార్ ప్రాంగణంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్, చైర్మన్ నాగబత్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద ఎస్ఈ చంటిబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈఈ పీఎస్ రాజ్‌కుమార్, పీఆర్ ప్రాజెక్ట్ డిప్యూటీ ఈఈ అన్యం రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి రామ్‌గోపాల్, ఎంపీడీవో మల్లికార్జునరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కాట్రేనికోన: మండలంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో దేశభక్తిని చాటి చెప్పేలా పంద్రాగస్టు వేడుకలు జరుపుకున్నారు. బలుసుతిప్పలో సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, పల్లంకుర్రు, కాట్రేనికోన పీహెచ్‌సీలు, కాట్రేనికోన ఆటో స్టాండ్ల వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. కాట్రేనికోన జెడ్పీ హెచ్ పాఠశాలలో విద్యార్థులకు 1989–90 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సేవా మిత్ర చారిటబుల్ ట్రస్టు ద్వారా రుచికరమైన భోజనం అందించారు.



ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కోలా గంగాభవానీ



యానాంలో అలరించిన చిన్నారుల నృత్యం



అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు



అమలాపురం పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఈ చంటిబాబు



ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ జానకి

మార్కెట్‌కు లక్ష్మీకళ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న లక్ష్మీరూపులు



కళకళలాడుతున్న పండ్ల దుకాణాలు



యానాంలో చిన్నా సెంటర్‌లో కొనుగోళ్ల సందడి

ముమ్మిడివరం: శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో మార్కెట్లు శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణ మాసం రెండో శుక్రవారం పూజల్లో మహిళలు కొత్త చీర, బంగారు లక్ష్మీరూపులు పెట్టుకుని వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తుంటారు. వరాలిచ్చే తల్లిగా లక్ష్మీదేవికి వివిధ రకాల పండ్లు, పువ్వులు, పిండి వంటలు పెట్టి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. దీంతో వస్త్ర దుకాణాలు, బంగారు షాపులు, పండ్ల దుకాణాలు గురువారం కళకళలాడాయి. వరలక్ష్మి వ్రతం ఆచరించే మహిళలు బంగారు లక్ష్మీరూపులు ఖరీదు చేసేందుకు క్యూ కట్టడంతో వర్తకులు, స్వర్ణకారులకు వరంగా మారింది. లక్ష్మీరూపుల విక్రయంతో బంగారం షాపులు కిటకిటలాడాయి. మార్కెట్‌లో ఒక్కోటి రూ.100 నుంచి రూ.8,000 వరకూ ధరల్లో లక్ష్మీరూపుల అమ్మకాలు సాగాయి. మరోవైపు మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో వస్త్ర దుకాణాలు కిక్కిరిశాయి. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని చామంతి పూలకు గిరాకీ పెరిగింది. మూడు పువ్వులు రూ.10కి విక్రయించారంటే మార్కెట్‌లో చామంతి పూలకు ఏర్పడిన డిమాండ్‌ను అర్థం చేసుకోవొచ్చు.

వరలక్ష్మీ వ్రత సందడి

యానాం: పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన మాసాల్లో శ్రావణమాసం ఒకటిగా చెబుతారు. ఈ నేపథ్యంలో మహిళలు ఎక్కువగా చేసే పూజలు, వ్రతాలు, నోములు ఈ నెలలోనే ఎక్కువగా ఉంటాయి. ఈనెల 16న వరలక్ష్మీ వ్రతం కావడంతో యానాం మార్కెట్‌లో వరలక్ష్మీ వ్రత పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. ముఖ్యంగా చిన్నాసెంటర్, విష్ణాలయం వీధి, పడవల రేవు వీధి, పిల్లారాయ వీధులు వివిధ పత్రి, పండ్ల అమ్మకాలతో కళకళలాడాయి.

స్వాతంత్ర్య వేడుకల్లో వితరణ



లక్ష్మీపతిపురంలో అంగన్‌వాడీ చిన్నారులకు కంచాలను అందజేస్తున్న తాతారావు తదితరులు

తాళ్లరేవు: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా స్థానిక సీహెచ్‌సీకి పలువురు దాతలు 100 కుర్చీలు, 100 బెడ్‌షీట్లు అందజేశారు. గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురంలో అంగాడి తాతారావు తన తండ్రి కన్నయ్య జ్ఞాపకార్థం అంగన్‌వాడీ చిన్నారులకు 100 కంచాలను బహూకరించారు. లక్ష్మీపతిపురం పాఠశాలలో ఏడుగురు టాపర్లకు నరసింహమూర్తి మాస్టారు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె వెంకటలక్ష్మి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, మాతరాజు, ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, సీహెచ్‌సీ డైరెక్టర్‌లు రోళ్ల చక్రవర్తి, అత్తిలి బాబూరావు, వాకపల్లి సరోజిని పాల్గొన్నారు.

విద్యార్థికి మెడల్ ప్రదానం



విద్యార్థి భువనేష్‌కు సాయిబాబా ప్రతిభా మెడల్‌ను ప్రదానం చేస్తున్న డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వాకాడ భువనేష్‌కు సాయిబాబా ప్రతిభా మెడల్ ప్రదానం చేశారు. స్థానిక పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో సత్య సాయి సేవా సంస్థల డివిజన్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ విద్యార్థి భువనేష్‌కు మెడల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం

అమలాపురం రూరల్: మండలంలోని గున్నేపల్లి అగ్రహారంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గున్నేపల్లి అగ్రహారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానిక టీడీపీ నాయకులు జాతీయ జెండాను తిరగేసి ఆవిష్కరించారు. సదరు దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో టీడీపీ నాయకులు జరిగిన తప్పును తెలుసుకుని జెండాను సరిచేశారు.

ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు



రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న పంచాయితీ రాజ్ డీఈఈ రాంబాబు



జిల్లా సమగ్ర శిక్షా అధికారి భీమారావు



అల్లవరం ఏఓ ఎస్ వీవీ సత్యనారాయణ



అమలాపురం ఎంఎస్ కోఆర్డినేటర్ రెహమాన్



పీఈటీ విష్ణుప్రసాద్



కామనగరువు కార్యదర్శి సూరిబాబు



ఎంపీటీసీ కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు

అమలాపురం టౌన్/అమలాపురం రూరల్/అల్లవరం/ఐ.పోలవరం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం బాలయోగి స్టేడియంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్‌ల చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అమలాపురం పంచాయితీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, జిల్లా సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎంఏకే భీమారావు, అమలాపురం మండల ఎంఎస్ కోఆర్డినేటర్ ఎస్‌కే రెహమాన్, అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పీఈటీ పరమట విష్ణుప్రసాద్, కామనగరువు గ్రామ సచివాలయం–2 కార్యదర్శి పీఎస్‌వీ సూరిబాబులకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. అల్లవరం మండల వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ జిల్లా ఉత్తమ వ్యవసాయాధికారిగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రం అందుకున్నారు. ఐ.పోలవరం మండల విద్యుత్‌శాఖ ఏఈ జి.సోమేశ్వరావు, ఉద్యానవన శాఖ వీహెచ్ఓ షేక్ దునియా అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకుంటున్న రిజర్వు సీఐ సూర్యనారాయణ

రిజర్వు సీఐ సూర్యనారాయణకు ఇండియన్ పోలీస్ మెడల్

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా రిజర్వు సీఐగా పనిచేస్తున్న డి.సూర్యనారాయణకు ఉత్తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. విజయవాడలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సీఐ సూర్యనారాయణకు ఈ మెడల్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ సూర్యనారాయణను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, జిల్లా ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.విజయసారథి అభినందించారు.

గురుకుల పాఠశాలకు గ్రీజర్ బహూకరణ

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాలకు పి.గన్నవరం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా రూ.15 వేల విలువైన వాటర్ ట్యాప్‌లు, గ్రీజర్ బహూకరించారు. అలాగే పాత గ్రీజర్లకు మరమ్మతులు చేయించారు. ట్రస్టు చైర్మన్ భీమాలను పాఠశాల అధ్యాపక సిబ్బంది సత్కరించారు. నాగుల్లంక పాఠశాలలో సీపీ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు వ్యవస్థాపకులు పి.చిట్టిబాబు ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు టిఫిన్ బాక్సులు అందించారు. సర్పంచ్ కృష్ణవేణి పాల్గొన్నారు.